క్లుప్తంగా

బాధ్యతల స్వీకరించిన అధికారులు



టి.వి.ఎన్.చిరంజీవి, ఎస్ఐ, సిద్దవటం

సిద్దవటం : మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం టి.వి.ఎన్. చిరంజీవి బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై సిద్దవటానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సంబేపల్లె తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

సంబేపల్లె : మండల తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కలెక్టరేట్‌లో పని చేస్తూ బదిలీలో భాగంగా సంబేపల్లెకు తహసీల్దార్‌గా వచ్చారు.

రామాపురం ఎస్ఐగా వెంకటసుధాకర్‌రెడ్డి

రామాపురం : మండల ఎస్ఐగా వెంకటసుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు, ఇసుక, నాటుసారాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్‌గా లక్ష్మీప్రసన్న



తహసీల్దార్‌కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్‌గా బుధవారం లక్ష్మీ ప్రసన్న బాధ్యతలు చేపట్టారు. తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీ ప్రసన్నకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కరిముల్లా, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న, ఆర్ఐ సమ్మత్ ఖాన్, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ–1గా వెంకటేష్ నాయక్

సుండుపల్లె : మండల విద్యాధికారి–1గా వెంకటేష్ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప ఆర్‌జేడీ రాఘవరెడ్డి విచారణకు సెలవు పెట్టకుండా విచారణకు వెళ్లడంతో ఎంక్వైరీ అధికారి ఆదేశాలతో ఆర్‌జేడీ శామ్యూల్ ఈయన్ను సస్పెండ్ చేశారు. బుధవారం తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ మరలా ఆదేశాలు జారీ చేశారు.

పెనగలూరు ఎంపీడీఓగా వరప్రసాద్



పెనగలూరు : పెనగలూరు ఎంపీడీఓగా వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలో భాగంగా ఈయన కోడూరుకు బదిలీ అయ్యారు. ఎన్నికలు అనంతరం తిరిగి సొంత ఊరుకే ఆయన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

లక్కిరెడ్డిపల్లి సీఐగా టి.వెంకటకొండారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి సీఐగా టి.వెంకట్ కొండారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లక్కిరెడ్డిపల్లి సీఐగా పనిచేస్తున్న జీవన్ గంగనాథబాబు అన్నమయ్య వీఆర్‌కు వెళ్లారు. వెంకట్ కొండారెడ్డి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి అర్బన్ పోలీస్ సేనన్ నుంచి బదిలీ నిమిత్తం లక్కిరెడ్డిపల్లెకు రానున్నారు.

అంగన్‌వాడీ సెంటర్లు తనిఖీ

పెనగలూరు : మండలంలోని పలు అంగన్‌వాడీ సెంటర్లను కోడూరు సెక్టార్ సీడీపీఓ రాజేశ్వరి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సింగనమల, సింగారెడ్డిపల్లి, సిరివరం, తిరుణంపల్లి, కొండూరు, కొండూరు హరిజనవాడ, అగ్రహారంలోని అంగన్‌వాడీ సెంటర్లలో రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సమయం ప్రకారం విధులు నిర్వర్తించాలని తెలియజేశారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని విజయవంతం చేయండి

పుల్లంపేట : స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించి ఏవైనా సమస్యలు ఉంటే అందులో చర్చించాలని ఎంఈఓ చక్రాధర్ రాజు తెలిపారు. ఈ సమావేశంలో సమస్యలను తెలియజేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

ఒంటిమిట్ట : బలిజ కులస్తులకు శ్మశాన స్థలం ఏర్పాటు చేయాలని మండలానికి చెందిన బలిజ కులస్తులు ఒంటిమిట్ట తహసీల్దార్ ఏవీ రమణమ్మకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పసుపులేటి కృష్ణయ్య, అంగదాల వెంకటసుబ్బయ్య, నరసయ్య, ఎల్లయ్య, గుర్రంకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అభివృద్ధే రాష్ట్రాభివృద్ధి



రాజంపేట రూరల్: ఊటుకూరులో నాయకులతో కలసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : గ్రామ స్థాయిలోని ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఊటుకూరు, మిట్టమీదపల్లి గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆయా గ్రామాలలో ఉన్న పలు సమస్యలను ఆయా గ్రామ ప్రజలు ఆకేపాటి దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగా పృథ్వీపతిరెడ్డి, దండు గోపీ, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, పోలీ వేణుగోపాల్‌రెడ్డి, రేవరాజు శ్రీనివాసురాజు, దాసరి పెంచలయ్య, వెంకటరామయ్యనాయుడు, పాపినేని విశ్వనాథరెడ్డి, మేడా నాగేశ్వరరెడ్డి, పోలీ వేణుగోపాల్‌రెడ్డి, మాలా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకట్‌రెడ్డి సేవలు మరువలేనివి

పెనగలూరు : డాక్టర్ వెంకటరెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి కొనియాడారు. బుధవారం వెంకటరెడ్డి స్వగ్రామమైన సాతుపల్లిలో సంవత్సరికం సభ జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకేపాటి డాక్టర్ వెంకటరెడ్డి, సతీమణి భారతీ చిత్రపటాలకు పూలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు సుబ్బరాయుడు, దాసరి పెంచలయ్య, నాయకులు రమేష్ నాయుడు, శ్రీను, పోలి వేణుగోపాల్ రెడ్డి, నాగ శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



అధికారులతో కలసి మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : రాయచోటిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో ఆయన పలు శాఖల అధికారులతో కలసి సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాయచోటి పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే 5 ఏళ్లలో రాయచోటిని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని చెప్పారు. మున్సిపల్ అధికారులతో చర్చించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, డీఈ సుధాకర్ నాయక్, ఆర్ఐ మల్లికార్జున, ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ చాన్‌బాషాతోపాటు పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

శిబ్యాలలో తాగునీటి మోటారు బిగింపు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామంలోని హౌసింగ్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడానికి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి గతంలో ఉన్న బోరుకు మోటారు బిగించారు. బుధవారం ఆ గ్రామంలో పర్యటించి సమస్యను తెలుసుకున్న ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో ఇప్పటి వరకు 18 బోరు మోటార్లు బిగించి సమస్యను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు.

రక్తమోడుతున్న రోడ్లు.. మిన్నంటుతున్న ఆర్తనాదాలు



రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి మృతదేహం వద్ద బంధువుల ఆక్రందనలు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని రోడ్లు జనాల ప్రాణాలకు తీసే మార్గాలుగా నిలుస్తున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. నియోజకవర్గంలోని రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె మండలాల్లోని కడప – చెన్నై జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో వ్యక్తులు బలవుతూ వారి కుటుంబసభ్యులకు తీరనిలోటును మిగులుస్తున్నాయి. సంఘటనలు జరిగిన ప్రాంతాల్లో తమ కుటుంబ సభ్యుడి మరణాన్ని చూసి తాళలేక భార్య, పిల్లలు, బంధువులు, స్నేహితుల ఆర్తనాదాలు అందరినీ కలచివేస్తున్నాయి. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, నిబంధనలు పాటించకపోవడం, ట్రాఫిక్ నియంత్రణలు లేకపోవడమే మరణాలకు కారణాలుగా మారుతున్నాయి. ఈ నెల 7వ తేదీన మాధవరంపోడుకు చెందిన కిరణ్‌కుమార్ రెడ్డి(23) ద్విచక్రవాహనంలో వెళుతూ లారీ ఢీకొని రహదారిపై మరణించిన ఘటన మరువకముందే రెండురోజుల క్రితం ఓబులవారిపల్లిలో రెండవ తరగతి చదువుతున్న భవిష్య అనే విద్యార్థిని మృత్యువాతపడ్డారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలో లారీ ఢీ కొని ఇరువురు మరణించడం రోడ్డు భద్రతపై భయాందోళనలు వ్యక్తం చేసేలా తయారయ్యాయి. ప్రభుత్వం, పోలీసులు దీనిపై ఆలోచించి కఠిన చర్యలు తీసుకొని నివారించాలని కోరుతున్నారు.

రేపు ఆలయాల్లో వరలక్ష్మి వ్రత పూజలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని రెడ్డీస్ కాలనీలో వెలసిన శ్రీ రామాంజనేయస్వామి ఆలయంలో రేపు (శుక్రవారం)వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారి పూజలతో ప్రారంభించబడుతుందని తెలిపారు. పూజలలో పాల్గొనే మహిళలు వ్రత సామగ్రి వెంట తెచ్చుకోవాలన్నారు. పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సిద్దేశ్వరస్వామి, కూటాలమ్మ దేవాలయాల వద్ద..

సుండుపల్లె : పెద్దబలిజపల్లె, మలక్కగారిపల్లె రహదారి మధ్యలో వెలసిన శ్రీ సిద్దేశ్వరస్వామి, కూటలమ్మ దేవాలయాల వద్ద శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామప్రజలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం, అర్చనలతో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబు

పుల్లంపేట : నేడు గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పుల్లంపేటలోని తహసీల్దార్ కార్యాలయం ముస్తాబైంది. జాతీయ జెండా రంగులతో కార్యాలయాన్ని అలంకరించారు. నేడు ఘనంగా మండలంలో స్వాతంత్ర్య వేడుకలు జరుగనున్నాయి.

పెనగలూరు : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పెనగలూరు హైస్కూల్‌ను ముస్తాబు చేశారు. భవనాల స్తంభాలకు మూడు రంగుల జెండాలను వేసి ప్రత్యేక ఆకర్షణగా చేశారు. అలాగే ప్రార్థనా స్టేజీపైన బోర్డులు నూతనంగా ఏర్పాటు చేసి హైస్కూల్‌కు కొత్త శోభ తీసుకువచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

వీరబల్లిలో తిరంగా ర్యాలీ

వీరబల్లి : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ ర్యాలీ కళాశాల నుంచి బస్టాండ్ మీదుగా ఎంపీడీఓ కార్యాలయం వరకు సాగింది. అనంతరం బస్టాండ్ కూడలిలో జాతీయ జెండాలు పట్టుకొని స్వాతంత్ర్యం గొప్పతనాన్ని గురించి ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా, ఎంపీడీఓ మల్లేశ్వరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, అధ్యాపకులు రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శిక్షణ పూర్తయిన వారికి రుణాలు

రాజంపేట టౌన్ : న్యాక్ కేంద్రంలో వివిధ వృత్తులకు సంబంధించి శిక్షణ పూర్తి చేసుకుని వ్యాపారం చేసేవారికి ఐదుశాతం వడ్డీతోనే పంజాబ్ నేషనల్ బ్యాంక్ రుణాలు ఇస్తుందని ఆ బ్యాంక్ రాజంపేట, రైల్వేకోడూరు శాఖల మేనేజర్లు ఎస్.సుబ్రమణ్యం, శివకుమార్ తెలిపారు. న్యాక్ కేంద్రానికి బుధవారం బ్యాంక్ తరఫున బీరువా, ఎనిమిది కుర్చీలను వితరణ చేశారు.

శ్రీకృష్ణ మందిరానికి భూమిపూజ

చిట్వేలి : పోల్లోపల్లి గ్రామంలో శ్రీకృష్ణ మందిరానికి రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బుధవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి, కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పుట్టినరోజును కార్యకర్తలు, నాయకులు బుధవారం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ధ్వజారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, చెవ్వుశ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

సిద్దవటం : మలినేనిపట్నంలో శ్రీ రామాలయం 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సీతారాముల ఉత్సవమూర్తులకు కళ్యాణం నిర్వహించారు. వేద పండితులు శ్రీసాయి గంగాధర్, శ్రీనాథ్,అర్చకులు ప్రసాద్ శర్మలు కల్యాణ క్రతువును జరిపించారు.

రాచపల్లిలో మాజీ ఎమ్మెల్యే పర్యటన

రామాపురం : రాచపల్లి గ్రామం మంగళపల్లికు చెందిన సి.వెంకటపతిరెడ్డి గృహప్రవేశం కార్యక్రమంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడి హాజరయ్యారు.

ముగిసిన శిక్షణా తరగతులు

వీరబల్లి : పంచాయతీ వ్యవస్థ నిర్వహణపై మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. పంచాయతీలను అభివృద్ధి పథంలో ఎలా నడపాలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

పంచాయతీ చట్టాలపై అవగాహన ఉండాలి

పెనగలూరు : గ్రామ పంచాయతీ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ సుబ్బరాయుడు బుధవారం తెలిపారు. మాట్లాడుతూ వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

24న సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 24న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డయ్య తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు.

ఆవిష్కరణలు సృజనాత్మకంగా ఉండాలి

రాజంపేట టౌన్ : ఇన్‌స్పైర్ పోటీలకు ఆన్‌లైన్‌లో విధిగా నామినేషన్లు పంపాలని ఎంఈఓ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం డివిజన్ స్థాయిలో గైడ్ టీచర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అన్ని యాజమాన్య పాఠశాలలు నామినేషన్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు నామినేషన్ల పంపాలన్నారు. ఆవిష్కరణలు సృజనాత్మకంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పరిమళ , రీసోర్స్ టీచర్స్ రవిశంకర్‌రెడ్డి, వెంకటేష్, రవీంద్ర, శివప్రసాద్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

మార్కెట్ హమాలీలను ఆదుకోండి

రాజంపేట రూరల్ : ఎన్నో సంవత్సరాలుగా కూరగాయాల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కూరగాయాల మార్కెట్‌లో బుధవారం హమాలీల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల హమాలీల అధ్యక్షుడిగా పి.రాముడు, ఉపాధ్యక్షులుగా దేవేంద్ర, రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బి.రవికుమార్, సహాయ కార్యదర్శిగా భీమలింగ, కోశాధికారిగా ఆర్.రామస్వామి నాయక్‌లను ఎన్నుకున్నారు.

చైతన్య సదస్సును జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : వడ్డెర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16న రాయచోటి పట్టణంలో నిర్వహించ తలపెట్టిన చైతన్య సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ రాతు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీశంకర్‌లు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆ సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. పట్టణంలోని అజయ్ రెసిడెన్సీలో జరిగే చైతన్య సదుస్సుకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు. వడ్డెర కులస్తుల వెనుకబాటు తనాన్ని వారి ద్వారా ప్రభుత్వానికి తెలియజేయవచ్చాన్నారు. సమావేశంలో వడ్డెరలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు.


మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రైల్వేకోడూరు అర్బన్ : మహిళలు స్వయం స్వయం ఉపాధి శిక్షణ ద్వారా ఆర్థికంగా ఎదగాలని బుధవారం కెనరా బ్యాంక్ మేనేజర్ నందిని తెలిపారు. పట్టణంలోని గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో కెనరా బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా మహిళలకు జూట్‌బ్యాగ్‌ల తయారీ శిక్షణకు కావాల్సిన కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యాలయంలో ట్రస్ట్ చైర్మన్ సారథి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని చౌటపల్లి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 30 మంది పేద విద్యార్థులకు కృష్ణయ్య అనే ఉపాధ్యాయుడు బుధవారం నోటుపుస్తకాలు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన సమ దుస్తులు, టైలర్ కూలీ డబ్బులను కృష్ణయ్య అందజేశారు. పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేయడం తన బాధ్యతగా తీసుకున్నానని తెలియజేశారు.









స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి



రాయచోటి టౌన్ : స్వాతంత్ర్య సమర యోధుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి దేశాభివృద్ధికి కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఓ ప్రకటన ద్వారా ఆయన నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో దేశం మహోజ్వలంగా ఎదగాలని ఆకాంక్షించారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలో వరుసగా మూడవ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుగుతుండటం హర్షదాయకమని చెప్పారు. పట్టణంలో తక్కువ కాలంలోనే పరేడ్ గ్రాండ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయని తెలిపారు. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కి అభివృద్ధి చెందాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకే జెండా ఆవిష్కరణ చేసే అవకాశం కల్పించడం హర్షనీయమని పేర్కొన్నారు.







